సాక్షి
మంగళవారం । 17 । జూన్ । 2025

విద్యార్థుల బస్సుపాస్ చార్జీల పెంపుపై నిరసన

నిజాంపేట్: విద్యార్థుల బస్సుపాస్ చార్జీల పెంపును నిరసిస్తూ కుత్బుల్లాపూర్ మండల ఎస్ఎఫ్ఐ కమిటీ స్థానికంగా ఉన్న డిపో ఎదుట సోమవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కార్తీక్ మాట్లాడుతూ.. ప్రస్తుతం సగటు విద్యార్థి నెలకు రూ.600 వరకు బస్సు పాస్ కోసం ఖర్చు చేయడం ఇది పేద, మధ్య తరగతి విద్యార్థులకు తీవ్రం భారంగా మారిందన్నారు. ప్రభుత్వమే ఉచిత బస్సుల పథకం పేరిట ఆర్థిక భారం ఏర్పరిచి, ఇప్పుడు ఆ లోటును విద్యార్థులపై మోపడం అన్యాయమని అన్నారు. బస్సు పాస్ ధరను రూ. 150కు తగ్గించాలని డిమాండ్ చేశారు. మండల అధ్యక్ష, కార్యదర్శి శివ, భగత్ నేతృత్వం వహించగా, జిల్లా కమిటీ సభ్యులు వసు, ఉదయ్, మల్లేశ్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చింతల్: విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 9:30 నుంచి సాయంత్రం 5:30 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని బోయిన్‌పల్లి ఏడీఈ శ్రీకాంత్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ సబ్‌స్టేషన్ చిన్నతోకట్ట ఫీడర్ పరిధిలో ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు, సెంట్రల్ ఎక్సైజ్ ఫీడర్ పరిధిలో రామ్‌గోపాల్ ఎంక్లేవ్, మారుతీనగర్, సాయిబాబా టెంపుల్ లైన్, సిండికేట్ బ్యాంక్ కాలనీ, వైష్ణవి రెసిడెన్సీ, ఎన్ఆర్ఎస్ఐ, ఎస్ఆర్ అపార్ట్‌మెంట్స్, సాయి నిలయం, సాయికృష్ణ రెసిడెన్సీ, హస్మత్‌పేట్ ఫీడర్ పరిధిలో ముస్లింబస్తీ, హస్మత్‌పేట్, లయన్ స్టోన్ కాలనీ, అబ్రార్ రెసిడెన్సీ, సూర్య ఎన్‌క్లేవ్, జీహెచ్ఎంసీ మోడల్ మార్కెట్, సత్య ఆర్కేడ్, ఏమ్రాల్డ్ లేక్ రెసిడెన్సీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

భౌరంపేట సబ్‌స్టేషన్ పరిధిలో..

దుండిగల్: భౌరంపేట సబ్‌స్టేషన్ పరిధిలో మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సాయి కిరణ్ తెలిపారు. కేవీఆర్ కాలనీ, స్ప్రింగ్ వుడ్, జేఎస్ఎస్ విల్లాస్, స్టెర్లింగ్ హోమ్స్, ప్రణీత్ నేచర్ బౌంటీ, శంభీపూర్ గ్రామం, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మల్లంపేట గ్రామం, డ్రీమ్ వ్యాలీ కాలనీ, ఆకాశ్ లే అవుట్, గ్రీన్ పార్క్ కాలనీ, ఏపీఆర్ విల్లాస్, జీఎల్‌సీ విల్లాస్, హై రైజ్ విల్లాస్, వెంకట ప్రణీత్ లీఫ్ తదితర ప్రాంతాల్లో సరఫరా ఉండదని పేర్కొన్నారు.

పార్టీలో కష్టపడేవారికి తగిన గుర్తింపు



అభిప్రాయాలు సేకరిస్తున్న కాంగ్రెస్ నేతలు

కుత్బుల్లాపూర్: పార్టీ కోసం కష్టపడేవారికి తప్పకుండా గుర్తింపు ఉంటుందని మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు హరివర్ధన్ రెడ్డి అన్నారు. కొంపల్లిలో పార్టీ సంస్థాగత నూతన కమిటీల ఏర్పాటులో భాగంగా అభిప్రాయ సేకరణ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. సంస్థాగత నిర్మాణంలో భాగంగా ఏఐసీసీ ఆదేశాల మేరకు టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ సారథ్యంలో రాష్ట్రంలో నూతన కమిటీలను నియమిస్తున్నామన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారని, సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు మరింత వివరించాలని సూచించారు. నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి మాట్లాడుతూ.. పదవులు వచ్చినా, రాకపోయినా అధైర్యపడవద్దని, నాయకులు, కార్యకర్తలకు సముచిత న్యాయం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు పారిజాత నర్సింహారెడ్డి, దుర్గం భాస్కర్, మాజీ టీపీసీసీ కార్యదర్శి భూపతి రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొత్త కలెక్టర్‌కు వినతుల వెల్లువ!

ప్రజావాణిలో 86 ఫిర్యాదులు



సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన మనుచౌదరిపై కొండంత ఆశతో ప్రజలు తమ సమస్యలు విన్నవించారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలు, బస్తీలు, పురపాలికల నుంచి తరలివచ్చిన మహిళలు, ప్రజలు తాము ఎదుర్కొంటున్న బాధలను రాతపూర్వకంగా కలెక్టర్ మనుచౌదరికి అందజేశారు. గతంలో పరిష్కారం కాని సమస్యలు కొత్త కలెక్టర్ పరిష్కరించగలరన్న ధీమాతో వినతులు సమర్పించడంతో పాటు తమ కష్టాలను చెప్పుకున్నారు. నిరుపేద ప్రజలు వ్యక్తిగత సమస్యలతో పాటు సంక్షేమ పథకాలు, ఉపాధి అవకాశాల కోసం ప్రజావాణిలో దరఖాస్తు చేసుకున్నారు. ప్రజావాణిలో వివిధ సంఘాల ప్రజలు మొత్తంగా 86 ఫిర్యాదులను రాతపూర్వకంగా కలెక్టర్‌కు అందజేశారు.

పురపాలక సంఘాల నుంచే అధికం

జిల్లాలో 4 మున్సిపల్ కార్పొరేషన్లు, 16 మున్సిపాలిటీలు ,జీహెచ్ఎంసీ పరిధిలోని 8 మున్సిపల్ సర్కిళ్లు ఉండగా.. ఇక్కడ నుంచే అధికంగా 27 ఫిర్యాదులు ప్రజావాణిలో వచ్చాయి. ల్యాండ్ సర్వే విభాగానికి 6, జిల్లా వైద్యారోగ్యశాఖకు 3, లోకల్ బాడీస్‌కు 7 ఫిర్యాదులు కలెక్టర్‌కు అందాయి. మల్కాజిగిరి, కీసర ఆర్డీఓ పరిధికి 5 ఫిర్యాదులు వచ్చాయి. కలెక్టరేట్ విభాగంలోని వివిధ సెక్షన్లలో పెండింగ్ పనులపై ప్రజావాణిలో 8 ఫిర్యాదులను అందజేశారు

సంక్షేమ పథకాల కోసం..

వివిధ ప్రాంతాలు, బస్తీల నుంచి వచ్చిన పలువురు ప్రజలు, మహిళలు సంక్షేమ పథకాలకు సంబంధించి పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డుల కోసం ప్రజావాణిలో దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వ, అసైన్డ్ భూముల పరిరక్షణపై కూడా వినతులు సమర్పించారు.

అదనపు కలెక్టర్లు రాధికాగుప్తా, విజయేందర్ రెడ్డి, డీఆర్‌ఓ హరిప్రియ, లా ఆఫీసర్ చంద్రావతి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. కలెక్టర్ మనుచౌదరి ప్రజావాణి కార్యక్రమానికి తప్పక హాజరవుతారన్న సమాచారం ఉండటంతో జిల్లా ఉన్నతాధికారుల హాజరు శాతం గతం కంటే గణనీయంగా పెరిగింది.

నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి : కలెక్టర్ మనుచౌదరి

జిల్లాలోని సుదూర ప్రాంతాల నుంచి ఎంతో వ్యయ, ప్రయాసలకు ఓర్చుకుని తమ సమస్యలు పరిష్కారమవుతాయనే నమ్మకంతో ప్రజలు మన వద్దకు వస్తారు. వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత అధికారులుగా తమపై ఉందని కలెక్టర్ సూచించారు. తిరస్కరించే దరఖాస్తుల సమాచారాన్ని సంబంధిత కారణాలతో అర్జీదారులకు తెలపాల్సిన బాధ్యత కూడా ఉందన్నారు. వినతులపై చేపట్టిన చర్యల వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో భద్రంగా పొందుపరచాలని సూచించారు.

తరగతి గదులు ప్రారంభం



ప్రారంభిస్తున్న ఎంఈవో జెమినీ కుమారి

సుభాష్‌నగర్: ప్రభుత్వ పాఠశాలలను స్వచ్ఛంద, ఇతర సంస్థలు దత్తత తీసుకోవడం అభినందనీయమని కుత్బుల్లాపూర్ ఎంఈఓ జెమినీ కుమారి అన్నారు. గాజులరామారం విలేజ్‌లోని ప్రాథమిక పాఠశాల శిథిలావస్థకు చేరడంతో కార్నివాల్ స్వచ్ఛంద సంస్థ భవనం నిర్మించేందుకు ముందుకు వచ్చింది. 6 గదులకు 2 రూంల నిర్మాణం పూర్తి కావడంతో సోమవారం ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యం



మొక్కలు నాటే కార్యక్రమంలో బీజేపీ శ్రేణులు

నిజాంపేట్ : బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమని ప్రగతినగర్ బీజేపీ అధ్యక్షుడు నరేంద్ర చౌదరి అన్నారు. పార్టీ సుపరిపాలనకు సంబంధించి కార్యాశాలను ప్రగతి నగర్‌లో సోమవారం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా మేడ్చల్ అర్బన్ జిల్లా ప్రధాన కార్యదర్శి విగ్నేష్ హాజరై కాకతీయ హిల్స్‌లోని పార్కులో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం బీజేపీ జెండాను ఆవిష్కరించారు. ప్రగతినగర్‌లో నెలకొన్న పలు సమస్యలపై రాజకీయ తీర్మానం ప్రవేశపెట్టగా ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా విగ్నేశ్ మాట్లాడుతూ..నాటి ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ కాలానికి ప్రస్తుతం మోదీ 11 ఏళ్ల సుపరిపాలనకి తేడా చాలా స్పష్టంగా ఉందని ప్రజాస్వామ్య పరిపాలన పారదర్శకతతో పార్టీ నేతృత్వంలోని మోదీ పాలన కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ ఎం.ఆర్.ఎస్.రాజు, ప్రధాన కార్యదర్శులు మదన్‌గౌడ్, సాయికిశోర్, సీనియర్ నాయకులు మందపాటి శ్రీధర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు సత్యనారాయణ, శివకుమార్‌గుప్తా, నల్లమోతు నరేశ్, కార్యదర్శులు లక్ష్మి, విత్తనాల సతీశ్, యువమోర్చా నాయకులు అనిరుద్ర, మైనార్టీ మోర్చా నాయకులు భారతీజెన్, మహిళా మోర్చా నాయకులు మోక్షశ్రీ, కోశాధికారి రవి తదితరులు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో 'డాన్ ఆన్ డస్క్'



పోలీస్‌స్టేషన్ ఆవరణలో బెంచీలు ఏర్పాటు చేసిన ప్రతినిధులు

కుత్బుల్లాపూర్: 'డాన్ ఆన్ డస్క్'లో భాగంగా సుచిత్ర సర్కిల్ వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా కుత్బుల్లాపూర్‌లోని గోశాలలో గరుకు స్తంభాన్ని ఏర్పాటు చేయడంతో పాటు పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌కు సిమెంట్ బెంచీలను సమకూర్చారు. సామాజిక బాధ్యతగా ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపడుతున్నట్లు క్లబ్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు రాజేశ్, వేణుగోపాల్, రాజేశ్వర్, చంద్రశేఖర్, తోట భిక్షపతి, సుచిత్ర సర్కిల్ వాసవీ క్లబ్ ప్రతినిధులు మాశెట్టి శివకుమార్, యోగేశ్వర్, నాగేశ్వర్, నాగరాజు, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

చలో కార్మిక భవన్‌కు తరలిరావాలి



జగద్గిరిగుట్ట: భవన నిర్మాణ సంక్షేమ మండలిని ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు కట్టబెట్టే ఆలోచన విరమించుకోవాలని భవన నిర్మాణ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. జగద్గిరిగుట్ట లేబర్ అడ్డా వద్ద సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. మంగళవారం తలపెట్టిన చలో కార్మిక భవన్‌కు కార్మికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు ఏసురత్నం, జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, భవన నిర్మాణ కార్మిక సంఘ జిల్లా అధ్యక్షుడు హరినాథ్ రావ్, కార్మిక సంఘం అధ్యక్షుడు బాలాజీ , జంబు, కార్మిక అడ్డా నాయకులు ముసలయ్య, రాములు, ఆశయ్య కార్మికులు పాల్గొన్నారు.

రోడ్డుపై మట్టిని తొలగించరూ..!



షాపూర్‌నగర్-చింతల్ రోడ్డులోని హెచ్ఎంటీ పరిశ్రమ సమీపంలో రోడ్డుపై ఉన్న మట్టి

రంగారెడ్డినగర్: ప్రధాన రోడ్డుపై మట్టి వ్యర్థాలతో ప్రమాదం పొంచి ఉన్నది. ఇటీవల ఓ కంపెనీ యాజమాన్యం షాపూర్‌నగర్ చౌరస్తా నుంచి కుత్బుల్లాపూర్ సర్కిల్ చౌరస్తా వరకు కేబుల్ లైన్ పనులు చేపట్టింది. ఈ క్రమంలో గోతులు తీయగా రోడ్డుపై డంప్ చేసిన మట్టి కుప్పలను సరిగ్గా తొలగించకుండానే చేతులు దులుపుకున్నారు. దీంతో హెచ్ఎంటీ పరిశ్రమ సమీపంలో రోడ్డుపై వెళ్లే క్రమంలో పలువురు వాహనదారులు జారి పడుతున్నారు. ఇప్పటికైనా సర్కిల్ అధికారులు స్పందించి సంబంధిత యాజమాన్యం మట్టిని పూర్తిగా తొలగించేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

బీరు సీసాతో వ్యక్తిపై దాడి

కుత్బుల్లాపూర్: బీరు సీసాతో ఓ వ్యక్తిపై దాడి చేసి గాయపరిచిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి 10.30 గంటల సమయంలో కొంపల్లి మున్సిపల్ సాయినగర్ కాలనీలో కొంతమంది రోడ్డుపై బైక్‌లు నిలిపి కేక్ కట్ చేస్తున్నారు. దీంతో సమీపంలో నివాసముండే శ్రీరాములు (38) రోడ్డుపై ఎందుకు గోల చేస్తున్నారంటూ ప్రశ్నించాడు. దీంతో వారి మధ్య మాట మాట పెరగడంతో సదరు వ్యక్తులు బీరు బాటిల్‌తో శ్రీరాములు తలపై దాడి చేయగా తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడి భార్య మాధవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బార్ నిర్వాహకులపై కేసు

కుత్బుల్లాపూర్: అధిక శబ్దంతో చుట్టు పక్కల వారిని ఇబ్బందులకు గురి చేసిన బార్ నిర్వాహకులపై పేట్‌బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. ఆదివారం రాత్రి 11 గంటల ప్రాంతంలో పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌పరిధిలోని నౌబా బార్ నుంచి సౌండ్ అధికంగా వస్తోందని స్థానికులు డయల్ 100 కు ఫిర్యాదు చేశారు. దీంతో వెంటనే అక్కడి చేరుకున్న పోలీసులు నిర్వాహకులపై సౌండ్ పొల్యూషన్ కేసు నమోదు చేశారు.

పూర్వ విద్యార్థుల సిల్వర్ జూబ్లీ వేడుకలు



కుత్బుల్లాపూర్: చింతల్ హెచ్ఎంటీ కాలనీ స్కూల్ 1999–2000 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల సిల్వర్ జూబ్లీ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ గేమ్స్ ఆడుతూ గెలిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు.

రేపటి నుంచి పీజీ కోర్సులకు దరఖాస్తుల స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల్లో పీజీ కోర్సుల ప్రవేశాలకు అధికారుల కసరత్తు ప్రారంభించారు. ఈ నెల 13న రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్‌తో పాటు ఇతర అధికారులు, వివిధ వర్సిటీల వీసీలు, సీపీగెట్ కన్వీనర్, ఇతర అధికారులు చర్చించి 18న నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు ప్రకటించారు.

గతంలో కేవలం పత్రికల్లో ప్రకటన జారీ చేసి పీజీ అడ్మిషన్ల పక్రియ ప్రారంభించే వారు. కానీ ఈసారి నోటిఫికేషన్ గతేడాది కంటే నెల రోజులు ఆలస్యమైంది. ఇతర కోర్సుల (లాసెట్, ఎడ్‌సెట్, ఐసెట్, పీజీఈసెట్, పీఈసెట్) నోటిఫికేషన్ ఏప్రిల్‌లో విడుదలై పరీక్షల ఫలితాలను కూడా ప్రకటించగా సీపీగెట్ పక్రియ వెనుకబడింది. దీంతో దరఖాస్తుల సీక్వరణ, ప్రవేశ పరీక్షలు, ఫలితాలు, కౌన్సెలింగ్ తరగతుల ప్రారంభం, సెమిస్టర్ పరీక్షలు వాటి ఫలితాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ కారణంగా పీజీ కోర్సుల విద్యా సంవత్సరం గాడితప్పింది. ఇదిలా ఉండగా కొన్ని వర్సిటీలు, అటానమస్ కాలేజీల్లో డిగ్రీ పరీక్షలు, ఫలితాల విడుదలలో జాప్యం వలన టీజీ సీపీజీఈటీ–2025 నోటిఫికేషన్ ఆలస్యంగా విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. కానీ డిగ్రీ అర్హతతో ఇతర సెట్లను నిర్వహించిన విషయాన్ని ప్రస్తావించడం లేదు.

రేపటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

రాష్ట్రంలోని 8 వర్సిటీల్లో ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, ఇతర పీజీ, ఐదేళ్ల కోర్సుల్లో ప్రవేశాలకు జరిగే ఎంట్రన్స్ టెస్టుకు రేపటి నుంచి(18న) ఆన్‌లైన్ దరఖాస్తులను స్వీకరించనున్నారు. పీజీ కోర్సుల్లో ఒక్క సబ్జెక్టుకు ఓసీ, బీసీలకు రూ.800, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌కు రూ.600, అదనంగా మరో సబ్జెక్టుకు దరఖాస్తు చేస్తే రూ.450 చెల్లించాలని అధికారులు తెలిపారు. 45 సబ్జెక్టులకు వచ్చే నెల 17 వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

ఫలితాలు వెల్లడించడంలో ఆలస్యం ఎందుకు ?

ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యూసఫ్

సుల్తాన్‌బజార్: నియామక ప్రక్రియలో పోటీ పరీక్షలు రాసిన తరువాత సంవత్సరాల తరబడి ఫలితాలు వెల్లడించడానికి ఆలస్యం ఎందుకని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యూసఫ్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఎంపీహెచ్‌డబ్ల్యూ (ఎఫ్) పరీక్షా ఫలితాలను విడుదల చేయాలని కోరుతూ రెండో ఏఎన్ఎంలు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కోఠిలోని మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ఎంఎస్ఆర్‌బీ) కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కంప్యూటర్ టెక్నాలజీ పెరిగిన ప్రస్తుత రోజుల్లో ఏళ్ల తరబడి ఫలితాలు వెల్లడించడంలో జాప్యం జరుగుతోందంటే లోపం ఎవరి వద్దనుందో గ్రహించాలన్నారు. ఒకవైపు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 65 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని, మరో 35 వేల ఉద్యోగాలు భర్తీ చేస్తామని ప్రతి సమావేశంలో మాట్లాడుతున్నారని కానీ అత్యంత కీలకమైన వైద్యా రంగానికి సంబంధించిన ఉద్యోగాలు నింపే ప్రక్రియ మాత్రం ముందుకు సాగడం లేదన్నారు. అనంతరం హెల్త్ మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ సంగీత సత్యనారాయణ, ఎంహెచ్ఎస్ఆర్‌బీ మెంబర్ సెక్రటరీ ఎస్.గోపీకాంత్ రెడ్డిలను కలిసి సమస్యల పై వినతి పత్రం అందజేశారు.

23 వరకు పీహెచ్‌డీ దరఖాస్తుల స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పీహెచ్‌డీ కేటగిరి–2 ఎంట్రన్స్ టెస్ట్–2025లో అర్హత సాధించిన అభ్యర్థులు ఈ నెల 23 వరకు ఆయా డీన్ ఫ్యాకల్టీ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని వర్సిటీ అధికారులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను పరిశీలించిన అనంతరం ఈ నెల 28న ఇంటర్వ్యూలకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను ప్రకటించనున్నారు. జులై 1 నుంచి 11 వరకు ఇంటర్వ్యూలను నిర్వహించి ఎంపికైన వారి జాబితాను 19న విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఓయూలో అన్ని విభాగాలలో 650 సీట్లకు సుమారు 5000 మంది అభ్యర్థులు పీహెచ్‌డీ ఎంట్రన్స్ టెస్ట్–2025లో అర్హత సాధించిన విషయం విదితమే. ఇదిలా ఉండగా ఓయూ పీహెచ్‌డీ సీట్ల పెంపునకు అధికారులు నిరాకరించినట్లు సమాచారం.







ప్రజావాణిలో 24 ఫిర్యాదులు

కుత్బుల్లాపూర్: జంట సర్కిళ్ల పరిధిలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 19 ఫిర్యాదులు అందాయి. కుత్బుల్లాపూర్ సర్కిల్ ఉప కమిషనర్ నరసింహ అధ్యక్షతన జరిగిన ప్రజావాణిలో 4 ఫిర్యాదులు రాగా టౌన్ ప్లానింగ్ విభాగం 2, ఇంజినీరింగ్, శానిటేషన్‌లో ఒక్కో ఫిర్యాదు వచ్చినట్లు తెలిపారు. అదేవిధంగా గాజులరామారం సర్కిల్ పరిధిలో ఉప కమిషనర్ మల్లారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 15 ఫిర్యాదులు రాగా ఇంజినీరింగ్ విభాగం 9, టౌన్ ప్లానింగ్ 4 , శానిటేషన్, ఎలక్ట్రికల్‌లో ఒక్కో ఫిర్యాదు రాగా వాటిని సంబంధిత శాఖ అధికారులకు అందజేశారు. వారం రోజుల్లో సమస్య పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు.

జలమండలి కార్యాలయంలో 5 ఫిర్యాదులు

చింతల్: కుత్బుల్లాపూర్‌లో నీటి సరఫరా మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నామని కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ జీఎం మాధవి అన్నారు. సోమవారం కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో మొత్తం 5 ఫిర్యాదులు వచ్చాయి. చింతల్ సెక్షన్ శ్రీరామ్‌నగర్, బాపునగర్‌లో లోప్రెషర్‌తో తాగునీరు సరఫరా అవుతోందని కాలనీవాసులు


కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయం ప్రజావాణిలో అధికారులు

ఫిర్యాదు చేశారు. సుచిత్ర సెక్షన్ బృందావన్ కాలనీలో మురుగునీరు మ్యాన్‌హోళ్ల నుంచి రోడ్లపై చేరుతోందని, అదేవిధంగా సూరారం సెక్షన్ వైష్ణవినగర్‌లో మ్యాన్‌హోళ్ల నుంచి మురుగు రోడ్లపైకి పారుతోందని యాదిరెడ్డి ఫిర్యాదు చేశారు. సుచిత్ర సెక్షన్ ఇంద్రాసింగ్‌నగర్‌లో లోప్రెషర్ కారణంగా నీరు సరిపోవడం లేదని, గ్రౌండ్ వాటర్‌లో కాలుష్యం కారణంగా రంగునీళ్లు వస్తున్నాయని, తమకు గోదావరి జలాలే దిక్కని భూషణం ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో వాటర్ వర్క్స్ డీజీఎంలు, మేనేజర్లు ఎలక్ట్రికల్ మేనేజర్, ఎస్‌ఓ తదితరులు పాల్గొన్నారు.

మీటర్ రీడర్లతో రెవెన్యూపై సమీక్ష

పెండింగ్ బిల్లులు వసూళ్లు చేయాలని జీఎం మాధవి మీటర్ రీడర్లకు సూచించారు. గడువులోగా ప్రతి వినియోగదారుడు నీటి బిల్లులు చెల్లించేలా చూడాలని మీటర్ రీడర్లను ఆదేశించారు.























